# ఎల్‌ఆర్‌ఎస్‌పై 111 జీఓ ఎఫెక్ట్

- 99 శాతం దరఖాస్తుల తిరస్కరణ
- మున్సిపాలిటీలో విలీన గ్రామాలతో కలిపి 10013 దరఖాస్తులు
- ఆమోదించదగినవి కేవలం 153 మాత్రమే




**శంషాబాద్‌:** భూముల క్రమబద్ధీకరణపై 111 జీఓ ప్రభావం పడింది. 111 జీఓ కారణంగా మున్సిపాలిటీ పరిధిలో 99 శాతం ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలనే ఆశతో పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. జీఓ 111 కారణంగా శంషాబాద్‌లో హెచ్‌ఎండీఏ ఆమోదించిన లేఅవుట్‌లు లేకపోవడంతో అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు ఎల్‌ఆర్‌ఎస్‌ వల్ల ఏమైనా క్రమబద్ధీకరణకు అవకాశం ఉంటుందనే ఆశలు అడియాసలే అయ్యాయి.

**జీఓ సడలింపుపై ఆశ**

గత సర్కారు 111 జీఓకు ప్రత్యామ్నాయంగా జీఓ 69 ప్రకటించినప్పటికీ మార్గదర్శకాల్లో ఎలాంటి మార్పులను అధికారికంగా ప్రకటించలేదు. ఏడాది పూర్తయినా కాంగ్రెస్‌ ప్రభుత్వం కూడా 111 జీఓ పరిధిలోని ఏరియాపై ఎలాంటి మార్గదర్శకాలు రూపొందించలేదు. దీంతో జీఓ 111లో ఉన్న నిబంధనలు నేటికి యధాతథంగా కొనసాగుతున్నాయి. మార్గదర్శకాల మార్పులతో ఎల్‌ఆర్‌ఎస్‌ వంటి ప్రయోజనం చేకూరుతుందేమోనన్న ఆశతో ప్రస్తుత విలీన గ్రామాలతో కలిపి ఉన్న మున్సిపాలిటీలో మొత్తం 10013 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సాతంరాయి. హుడా కాలనీ, ఎయిర్‌పోర్టు కాలనీల నుంచి వచ్చిన 153 దరఖాస్తులకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రయోజనం చేకూరుతుందని అధికారులు గుర్తించారు. ఇందులో కూడా అతి స్వల్పంగా ఇప్పటి వరకు కేవలం 15 మంది మాత్రమే ఇందుకు సంబంధించి ఫీజులు చెల్లించారు.

**అన్నీ అక్రమ వెంచర్లే**

క్రమబద్ధీకరణకు 10013 దరఖాస్తులు రాగా పట్టణంలో దరఖాస్తు చేసుకోని లబ్ధిదారుల సంఖ్య అందుకు రెట్టింపు ఉంటుంది. శంషాబాద్‌ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గత నాలుగైదేళ్లుగా హెచ్‌ఎండీఏ అనుమతి లేని వాటి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోవడంతో అక్రమార్కులు గుంటల లెక్కల పెద్ద ఎత్తున ప్లాట్లను విక్రయిస్తున్నారు. గత ఏడాది కాలంలో సుమారు పదికి పైగా వెంచర్లలో గుంటల లెక్కల ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అధికారికంగా ఎలాంటి చర్యలు లేవు.

**మార్గదర్శకాలు రూపొందించాలి**



జీఓ 111 పై ప్రస్తుత ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించాలి, ఎల్‌ఆర్‌ఎస్‌కు ఆమోదయోగ్యమైన వాటిని పరిగణలోకి తీసుకోవాలి. డబ్బులు చెల్లించి వేలాది మంది దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. అక్రమ కట్టడాలను నిలువరించలేని ప్రభుత్వం కనీసం ప్రభుత్వ ఖజానాకు ప్రయోజనం చేకూర్చేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటే మంచిది. దీంతో దరఖాస్తుదారులతో పాటు ప్రభుత్వానికి ప్రయోజనకరంగా ఉంటుంది.

–మురళీ కృష్ణ: శంషాబాద్‌

## క్రమశిక్షణ, పట్టుదలతోనే లక్ష్య సాధన



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌



**మైలార్‌దేవ్‌పల్లి:** విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం గాయత్రీ ఈ–టెక్నో స్కూల్‌ గ్రాడ్యుయేషన్‌ డే వేడుకలను టీదాన్‌లోని అమ్మగార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ మాట్లాడుతూ విద్యారంగంలో గత 12 ఏళ్లుగా గాయత్రీ ఈ–టెక్నో పాఠశాల అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గాయత్రీ పాఠశాలలో చదివిన విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్‌ కె.మధుసూదన్‌, డైరెక్టర్లు సమీయుద్దీన్‌, శ్రీహరి, సీఈవో సర్వేశ్వర్‌ రావు, అకాడమిక్‌ కోఆర్డినేటర్‌ నిరంజన్‌ శాస్త్రితో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కల్యాణం



పూజల్లో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి:** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌, పద్మశాలిపురంలో శివాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్‌ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. శివపార్వతుల ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు ఎల్‌.వి.రెడ్డి, మహిపాల్‌, భూపతిరెడ్డి, తలారి చిన్న, బుగ్గయ్య, గురుస్వామి రమేష్‌, అవినాష్‌, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 26న శివసాయిక్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలు

**రాయదుర్గం:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఈనెల 26న శివరాత్రి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి 11.45 గంటల వరకు ప్రత్యేకంగా ఆలయంలోని దేవతా మూర్తులకు అభిషేకం చేస్తారు. 8 గంటలకు మహాశివలింగ అభిషేకం, 9 గంటలకు అష్టోత్తర శత కలశస్థాపన, 12 గంటలకు ప్రత్యేక అలంకారం, నైవేద్య సమర్పణ, మంత్రపుష్పం, మధ్యాహ్నం 1.30 గంటలకు రుద్రహోమం నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు దర్శనం, అర్చన కార్యక్రమం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదోశ కాల అభిషేకం, రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు శివ కల్యాణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు స్థాపిత కలశ జలాలతో అభిషేకం, 12.30 గంటలకు అన్నాభిషేకం, రాత్రి 1 గంటకు ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

**జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌ ఆలయంలో..**

**రాయదుర్గం:** గచ్చిబౌలి జీపీఆర్‌ఏక్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు జరుగుతాయి. భక్తులు తమ స్వహస్తాలతో స్వయంగా చంద్రమౌళీశ్వర స్వామి వారికి అభిషేకం చేసే అవకాశం కల్పించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు.

**25 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు**

గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు రోజుల పాటు 25, 26,27వ తేదీల్లో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్‌ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## 25న భాగ్యలక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం



భాగ్యలక్ష్మీ దేవి అమ్మవారు



నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ దేవి ఆలయం

**రాయదుర్గం:** నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నానక్‌రాంగూడలో 2000 సంవత్సరంలో చిన్న ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. అప్పటి నుంచి ఏటా ఫిబ్రవరి 25న వార్షికోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ధర్మకర్త తుకారామ్‌ ఆధ్వర్యంలో, పూజారి జోగేంద్రశర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మెదక్‌జిల్లా రుస్తుంపేటలోని శ్రీమదానంద సరస్వతిస్వామి ఆశ్రమానికి చెందిన రాజయోగి వెంకటస్వామి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పూలు, విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

**పూజా కార్యక్రమాలు ఇవీ..**

భాగ్యలక్ష్మీ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం 7.30 గంటలకు ఆలయంలో గణపతిపూజ, పుణ్యావాచనంతో వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తారు. అనంతరం పంచగవ్య (ఆరాధన)ప్రసన్న కార్యక్రమం, వాస్తుపూజ, వాస్తుహోమం, విశేష ఆరాధన, బాలభోగం, అష్టకలశాభిషేకం లక్ష్మీ మహాయజ్ఞం, మూల మంత్రంతో ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమం, సహస్రనామార్చన, అమ్మవారి ఒడి నింపుట కార్యక్రమం నిర్వహిస్తారు.అనంతరం మహానైవేద్యం, హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**రాజేంద్రనగర్‌:** తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కిస్మత్‌పూర్‌ గ్రామానికి చెందిన మెరుగు జంగయ్య గౌడ్‌ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ యువకుడుఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. అల్మారా తెరిచిన శబ్దం విన్న పక్కింటి మహిళ అక్కడికి రాగా సదరు యువకుడు ఆమెను పక్కకు తోసి బయటికి పరిగెత్తాడు. ఈ దృశ్యాన్ని పక్కనే ఉన్న మేడపై ఉన్న మరో మహిళ తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసింది. దీనిపై సమాచారం అందుకున్న జంగయ్య కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి పరిశీలించగా రూ. 3 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. రాజేంద్రనగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీఎస్‌ఎఫ్‌ హెచ్‌సీయూ నూతన అధ్యక్షుడిగా అంజి ఎర్రోళ్ల

**రాయదుర్గం:** హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ బహుజన స్టూడెంట్స్‌ ఫ్రంట్‌(బీఎస్‌ఎఫ్‌) నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కన్వీనర్‌గా గుంటి రోహిత్‌, అధ్యక్షుడిగా అంజి ఎర్రోళ్ల, ఉపాధ్యక్షులుగా రచన, దివాకర్‌, ఆశ్చర్యలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా సంధ్య పోగు ప్రసన్న, ముద్దమ్‌ నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు అంజి ఎర్రోళ్ల మాట్లాడుతూ బహుజన మహనీయుల ఆశయ సాధనే లక్ష్యంగా బీఎస్‌ఎఫ్‌ పనిచేస్తుందన్నారు. పూలే, అంబేద్కర్‌, కాన్షీరామ్‌ల ఆలోచనలు, పోరాటాలు, త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ బహుజన విద్యార్థులను సంఘటితం చేయడంతో బీఎస్‌ఎఫ్‌ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు.

## మార్చి 9న ఆల్‌ కాలనీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఎన్నికలు

**మణికొండ:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌ కాలనీస్‌ రెసిడెన్షియల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఫెడరేషన్‌ ఎన్నికలను మార్చి 9న నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. పోటీ చేయాలనుకునే వారు ఎన్నికల అధికారులకు తమ నామినేషన్లను సమర్పించాలని తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఓ సారి ఎన్నికలు జరుగుతాయని, అందులో భాగంగా అధ్యక్షుడు, 5 మంది ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు 5 మంది, కార్యనిర్వాహక కార్యదర్శులు 7 మంది, కోశాధికారి, ఉప కోశాధికారులకు ఎన్నికలు ఉంటాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లోని సమస్యలపై అవగాహన ఉండి వాటి పరిష్కారానికి కృషి చేయగలిగి, రాజకీయ పార్టీలకు సంబంధం లేని వారు ముందుకు రావాలన్నారు. సాయిరాం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 4,5 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. వివరాలకు ఎన్నికల అధికారులు సత్యనారాయణ మూర్తి ఫోన్‌ 9963088807, బీవీ సత్యనారాయణ ఫోన్‌ 8886111268 సంప్రదించాలని సూచించారు.

## కమనీయం మల్లన్న కల్యాణం




వట్టినాగులపల్లి మల్లన్న స్వామి



దేవాలయానికి వెలుతున్న భక్తులు

**మణికొండ:** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో ఆదివారం మల్లన్న కల్యాణం, బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దేవాలయం, వీధులను మామిడి తోరణాలతో అలంకరించి, మల్లన్న భక్తి పాటలు, ఒగ్గు కథలతో హోరెత్తించారు. మహిళలు మల్లన్న కల్యాణంలో పాల్గొన్న అనంతరం సాయంత్రం అక్కడే బోనాలను సిద్ధం చేసి స్వామి వారికి సమర్పించారు. బోనాల సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



## దోమల దండయాత్ర

- సాయంత్రం అయితే డోర్లు బంద్‌
- ఇంట్లో నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి
- చెరువు చుట్టుపక్కల కాలనీలకు నరకం
- స్పందించని మున్సిపల్‌ యంత్రాంగం
- దోమల దండు వీడియోలు వైరల్‌

**మణికొండ:** నెక్నాంపూర్‌ చెరువు పరిసరాల్లో సాయంత్రం అయ్యిందంటే చాలు దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఇసుక తుఫాన్‌ మాదిరిగా వేలాది దోమలు ఒక్కసారిగా జట్టు కట్టి తిరుగుతున్నాయి. ఏ మాత్రం అదమరచి డోర్లు, కిటికీలు తెరిచామంటే చాలు ఇక ఆ రాత్రికి వాటిని చంపడం, బయటకు పంపటమే పనిగా మారిపోతుంది. ఇక రోడ్లపైకి వెళ్లాలంటే జంకే పరిస్థితి నెలకొంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌ పెద్ద చెరువు పరిసరాల్లో ఈవీవీ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, వైఎస్సార్‌ కాలనీ, పాషాకాలనీ, 60 గజాలకాలనీ, ఫెయిర్‌ఫీల్డ్‌, నెక్నాంపూర్‌ గ్రామం, లేక్‌ వ్యూ విల్లాస్‌, ఫ్లోటిల్లా గేటెడ్‌ కమ్యూనిటీలు ఉన్నాయి.

- నెక్నాంపూర్‌ చిన్నచెరువు సమీపంలోనే అలకాపూర్‌ టౌన్‌షిప్‌ ఉంది. చెరువు అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో చెరువులో గుర్రపుడెక్క పెరిగిపోయింది. దీంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయింది. సాయంత్రం అయ్యిందంటే చాలు గుంపులు, గుంపులుగా కాలనీల్లోకి వస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాటి బారిన పడి విష జ్వరాలు, మలేరియా, డెంగీ లాంటి రోగాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.
- దోమల వ్యాప్తిని అరికట్టక పోతే రాబోయే రోజుల్లో వందలాది మందికి అవి సోకి అనారోగ్య కాలనీలుగా అవి మారే పరిస్థితి ఉందన్నారు. ఆదివారం సాయంత్రం చెరువు పక్కన ఉన్న ఓ కాలనీవాసులు దోమల వ్యాప్తిపై వీడియోలు పెట్టడంతో అవి వైరల్‌ అయ్యాయి.

**నివారణ చర్యలు చేపట్టాలి..**

నెక్నాంపూర్‌ చెరువులో పెరిగిపోయిన గుర్రపుడెక్కను తొలగించే పనులను ఒకే ఒక్క యంత్రంతో కొనసాగిస్తున్నారు. దీంతో పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుర్రపుడెక్కను తొలగించడంతో పాటు మురుగునీటిని పూర్తిగా బయటకు పంపాలని, యాంటీ లార్వా మందును పిచికారీ చేసి దోమల గుడ్లను నివారించాలని పలువురు సూచిస్తున్నారు. చెరువు చుట్టు పక్కల కాలనీల్లో ప్రతి రోజు సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్‌ చేపట్టాలన్నారు.



చెరువు పక్కన గుంపులుగా సంచరిస్తున్న దోమలు



గుర్రపుడెక్కతో నిండి ఉన్న నెక్నాంపూర్‌ చెరువు

## ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



**మాదాపూర్‌:** కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బెంగళూరుకి చెందిన సుముఖ శ్రీ కళా కుటీర గురువు అశ్విని సుకీర్తి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. తం తం తం మూషికవాహన, రరావేణు, సరసిజాక్షులు, దరువర్ణం, శ్రీరాజ రాజేశ్వరీ, జావళి, చంద్రచూడా, నవరస రామాయణ తదితర అంశాలను కళాకారులు పూజిత, రక్షిత, మోనికా, సుదీప్తి, వర్ష, కీర్తన, వైభవి తదితరులు నృత్యరూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

## నేడు గండిపేటలో విద్యుత్‌ సరఫరా నిలిపివేత

**మణికొండ:** గండిపేట సీబీఐటీ సబ్‌స్టేషన్‌లో సోమవారం మరమ్మతులు, సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌ పనులు చేపడుతున్నందున సోమవారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నార్సింగి ఏఈ మణికొండ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గండిపేట గ్రామంలో విద్యుత్‌ సరఫరా ఉండదని ఆయన వివరించారు.

## నేడు ప్రజావాణి కార్యక్రమం...

**రాజేంద్రనగర్‌:** రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవి కుమార్‌ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సర్కిల్‌ కార్యాలయంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సర్కిల్‌ పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఈ అవకాశాన్ని సర్కిల్‌ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్‌

**అత్తాపూర్‌:** రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌ బేగ్‌ అన్నారు. సులేమాన్‌నగర్‌ డివిజన్‌ చింతల్‌మెట్‌ పరిధిలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నవాజుద్దీన్‌, మహ్మద్‌ తాహెర్‌ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



మణెమ్మ(ఫైల్‌)

**శంషాబాద్‌:** ఓ మహిళ అదృశ్యమైన సంఘటన శంషాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. వనపర్తికి చెందిన మణెమ్మ, భాస్కర్‌ దంపతులు నగరానికి వలస వచ్చి ఊట్‌పల్లిలో గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ నెల 1న భాస్కర్‌ ప్లాస్టిక్‌ సామన్లు విక్రయించేందుకు సంగారెడ్డి వెళ్లి మర్నాడు తిరిగి వచ్చాడు. మణెమ్మ(30) ఇంట్లో లేకపోవడంతో పరిసరాల్లో ఆరా తీయడంతో ఆదే రోజు బయటికి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. దీంతో అతను ఆదివారం శంషాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 26న మహా రుద్రాభిషేకం

**చార్మినార్‌:** మహాశివరాత్రి సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ గాజుల అంజయ్య తెలిపారు. 26న తెల్లవారుజామున 4 గంటల నుంచి గణపతి పూజ, పుణ్య వాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, మండపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అభిషేకం, అమ్మవారికి, ఆలయ సకల దేవతాభిషేకం, రుద్ర హోమం, అలంకరణ, సహస్ర నామ బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 7 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 9 గంటలకు 108 కళశాలతో అష్టోత్తర మహా రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భవం, అన్న అభిషేకం, పంచ హారతి మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం మహా శివరాత్రి జాగరణ కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

## ‘సైన్స్‌ ఎగ్జిబిషన్లు మేధాశక్తిని పెంచుతాయి’

**జియాగూడ:** సైన్స్‌ ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచుతాయిని కేటీఎస్‌ అధ్యక్షుడు పి.జైపాల్‌రెడ్డి, అకాడమిక్‌ బి.బాలాజీ అన్నారు. ఆదివారం జియాగూడలోని కృష్ణవేణి టాలెంట్స్‌ స్కూల్స్‌ జియాగూడ, రహీంపురా బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్‌ శ్రీనివాస్‌, నాగేష్‌ ఆధ్వర్యంలో ఏర్పాటైన డిస్కావర్‌, ఇన్స్పైర్‌, సక్సెస్‌ (ఇన్నోవేటివ్‌ షోకేస్‌) 2025 ప్రదర్శనలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో 770 మంది విద్యార్థులు 450 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. స్థానిక బస్తీల వాసులు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదర్శనలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో జోనల్‌ మేనేజర్‌ జహంగీర్‌ పాల్గొన్నారు.

